ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 2 జూన్ 2024



అనుగ్రహించు.. హనుమా..!

వైభవోపేతంగా హనుమజ్జయంతి
భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
కసాపురంలో శ్రీరామపట్టాభిషేకం

వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా శనివారం దక్షిణాది హనుమద్ జయంత్యుత్స వాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషే కాలు, అర్చనలు, ప్రవచనాలు, హనుమాన్ చాలీసా పఠనాలను నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. కసాపురం ఆలయంలో శ్రీరామ పట్టాభిషేకాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో నెట్టికంటి ఆయంజనేయ స్వామి మూల విరాట్టును అభిషేకించి.. వజ్ర ఖచిత స్వర్ణ వస్త్ర, కవచాలు, పుష్పా లతో, తోమాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆలయ ఆరా ధన, వేద, సుందరకాండ, మన్యుసూక్త పారాయణం చేశారు. అనంతరం యాగశాలలో మన్యుసూక్త హోమం, శ్రీరామ ఆంజనేయ మూల మంత్రానుష్టానాలు చేపట్టారు. ఆలయంలో శ్రీరామ పట్టాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ సహిత లక్ష్మణ, ఆంజనేయుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. పట్టాభిషేకం సందర్భంగా బలిహరణ, పూర్ణాహుతి, కలశోద్వాసన, మహాదాశీర్వచన కార్యక్ర మాలను చేపట్టారు. ఆలయంలో నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి ఆధ్వర్యంలో సుందరకాండ, హనుమద్వైభవంపై ప్రవచనాన్ని నిర్వ హించారు. సాయంత్రం ఒంటె వాహనంపై స్వామివార్లకు ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. వేడుకలలో ఆలయ ఈఓ భద్రాజీ, ధర్మకర్తల మండలి ఛైర్‌ప ర్సన్ సుగుణమ్మ, సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

- అనంతపురం కల్చరల్, గుంతకల్లు


క్షీరాభిషేకం..


హౌసింగ్ బోర్డు ఆంజనేయస్వామి ఆలయంలో...


అలంకారాలతో నెట్టికంటి ఆంజనేయుడి మూల విరాట్టు


ఒంటె వాహనంపై ప్రాకారోత్సవం


అనంత కోర్టు రోడ్డులోని వరదాంజనేయస్వామి ఆలయంలో...




గుత్తి: వేరుశనగ విత్తనాలను సిద్ధం చేస్తున్న మహిళలు


గుత్తి మండలంలో ముంగారు సేద్యం పనులు

ఆశల సాగుకు సిద్ధం

ఖరీఫ్ సీజన్ ప్రారంభం
70 శాతం దుక్కులు పూర్తి
వర్షం పడితే విత్తేందుకు ఏర్పాట్లు

అనంతపురం అర్బన్/ గుత్తి రూరల్, జూన్ 1: అన్నదాతల ఆశల సీజన్ ఖరీఫ్ వచ్చేసింది. ప్రతి ఏడాది జూన్ 1 నుంచి సీజన్ ప్రారంభమై సెప్టెంబరు నెలాఖరుతో ముగుస్తుంది. ఖరీఫ్‌లో జిల్లా లోని మెట్ట భూముల్లో వర్షాధారం కింద ప్రధాన పంటగా వేరుశనగ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా సరాసరి సాధారణ సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.97 లక్షల హెక్టార్లు, కంది 37వేలు, పత్తి 48వేలు, ఆముదం 16వేలు, వరి 18వేల హెక్టార్లు, మిగతా విస్తీర్ణంలో జొన్న, మొక్కజొన్న, రాగి, చిరుధాన్యాలు, పొద్దుతిరుగుడు, ఉలవలు,పెసలు, అలసంద తదితర రకాలు అంతర పంటలు సాగవుతాయని వ్యవసా యశాఖ అంచనా వేసింది. ప్రతి ఏడాది జూన్ మొదటి, రెండో వారంలో జిల్లాకు నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయి. గత ఏడా దితో పోలిస్తే ఈసారి ముందుగానే జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటు న్నారు.


గుత్తి మండలంలో సేద్యం చేసిన పొలం

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం 42.0 26.0

దుక్కి దున్నేస్తున్నారు..

ఈసారి గత నెలలో కురిసిన వర్షాలకు జిల్లాలోని మెట్ట భూముల్లో 70 శాతం దాకా దుక్కులు పూర్తయ్యాయి. దుక్కులు దున్నుకున్న తర్వాత వర్షం పడితే నేరుగా విత్తనం వేసుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. దుక్కులు చేసుకున్న ప్రాంతాల్లో మరో మారు వర్షం పడితే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఖరీఫ్ సీజ న్‌లో జూన్ 15 నుంచి జూలై 15 వరకు వేరుశనగ విత్తనం విత్తుకునేందుకు అదును సమయంగా వ్యవసాయ శాస్త్రవే త్తలు చెబుతున్నారు. ఆ సమయంలో విత్తనం వేసుకుంటే దిగుబడులు బాగుంటాయని స్పష్టం చేస్తున్నారు. ఈనెల 7వతేదీ మృగశిర కార్తె ఆరంభం కానుంది. మరోవైపు ఈసారి నైరుతి రుతుపవనాలు గతంలో కంటే ముందు గానే జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉన్నందున పదును వర్షం పడితే విత్తనం విత్తేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. గత ఏడు రోజులుగా జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరు శనగ పంపిణీ చేస్తు న్నారు. ఇప్పటి దాకా 47వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. అంతర పంటల విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారైనప్పటికీ ఇంకా పంపిణీ మొదలు పెట్టలేదు. ఇప్పటికే దుక్కులు పూర్త యిన పొలాల్లో మరోసారి వర్షం పడితే విత్తనం వేసేం దుకు సిద్ధమైన రైతులు ఎప్పటిలోగా అంతర పంటల విత్త నాలు ఇస్తారంటూ నిట్టూరుస్తున్నారు. కొందరు రైతులు బహిరంగ మార్కెట్‌లో అంతర పంటల విత్తనాలు కొను గోలు చేస్తున్నారు. మరికొందరు సబ్సిడీ అంతర పంటల విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు.

నాలుగు రోజుల్లో జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు

ఖరీఫ్‌లో నైరుతి రుతుపవనాల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏడాది జూన్ మొదటి వారంలోనే నైరుతిరుతుపవనాలు సీమలోకి ప్రవేశిస్తు న్నాయి. గురువారం నైరుతిరుతుపవనాలు కేరళను తాకాయి. మరో నాలుగు రోజుల్లో జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది. గత ఏడాది జూన్ 5న కేరళకు నైరుతి రుతుపవనాలు తాకి, జిల్లాలోకి అదే నెల 8న ప్రవేశించాయి.

పదును వర్షం పడితే విత్తేస్తాం



గత నెలలో వర్షాలకు మూడెక రాల్లో సేద్యం పనులు పూర్తి చేశా. ఖరీఫ్‌లో పదును వర్షం పడితే వేరుశనగ విత్తనం విత్తేం దుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే విత్తన కాయలు రెడీ చేసు కున్నాం. వర్షం కోసమే ఎదురు చూస్తున్నాం.

- సుధాకర్, కొత్తపేట, గుత్తి మండలం

వర్షం కోసం ఎదురు చూస్తున్నాం..



నైరుతిరుతుపవనాల కోసం ఎదురుచూస్తున్నాం. ఈసారి నాలుగెకరాల్లో వేరుశనగ సాగు చేయాలనుకున్నా. వర్షాలు ముందస్తుగా పడితే మృగశిర కార్తెలోనే విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నా. ఈసారి ముందుగానే రుతుపవనాలు జిల్లాకు వస్తాయని చెబుతున్నారు. ఈసారి వర్షాలు బాగా పడితే మా పంటనండినట్లే.

- నాగేష్, జక్కలచెరువు, గుత్తి మండలం

ముందుగానే జిల్లాకు నైరుతి రుతుపవనాలు



ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు గతేడా దితో పోలిస్తే ముందుగానే ప్రవేశించే అవకాశం ఉంది. గురువారం రుతుపవనాలు కేర ళను తాకాయి. జూన్ 4 నుంచి 6వ తేదీలోగా జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు తాకే అవకాశం ఉంది. రాబోవు ఐదు రోజుల్లో జిల్లాలో చిరుజల్లుల నుంచి ఓ మోస్తారు వర్షం పడే అవకాశం ఉంది. ఈసారి సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదయ్యే అవకా శాలు ఉన్నాయి.

- నారాయణస్వామి, సీనియర్ శాస్త్రవేత్త, వాతావరణ విభాగం, రేకులకుంట


గుత్తి రోడ్డులోని యూనియన్ బ్యాంకు వద్ద ఆరుబయట కూర్చున్న పింఛన్‌దారులు

పాపం.. వృద్ధులు పింఛన్ కోసం పాట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 1: పింఛన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వృద్ధులకు శాపంగా మారింది. ఇంటింటికీ పంపిణీ చేసే వెసులుబాటు ఉన్నా.. ఈ నెల కూడా బ్యాంకుల్లోనే జమ చేశారు. దీంతో పింఛన్ సొమ్ము తీసుకునేందుకు శనివారం ఉదయం నుంచే బ్యాంకుల వద్ద మండుటెండలో పడిగాపులు కాశారు. బ్యాంకు ఖాతాల్లో సొమ్ము మధ్యాహ్నం నుంచి జమ చేయడం మొదలు పెట్టారు. దీంతో బ్యాంకులు వృద్ధులతో కిక్కిరి సిపోయాయి. ఏప్రిల్, మే నెలల తరహాలోనే ఈ నెలా ఇబ్బం దులు ఎదర్కొన్నారు. నగదు జమకాలేదని చెప్పడంతో చాలా మంది వెళ్లిపోయారు. మే 31వ తేదీ సాయంత్రానికే బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమచేస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. శని వారం సాయంత్రానికి గానీ వేయలేదు. కొందరికి ఇంటి వద్దే ఇస్తా మన్నారేగాని.. సాయంత్రం వరకూ ఇవ్వలేదు.


కళ్యాణ దుర్గం రోడ్డులోని ఎస్‌బీఐ వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

కౌంటింగ్ ఏజెంట్లు ఉండొచ్చు

అనంతపురం అర్బన్/క్రైం, జూన్ 1: కౌంటింగ్ ఏజెంట్లు ఈ నెల 3వ తేదీ సాయంత్రం నుంచి అనంతపురం నగరంలో ఉండేందుకు అనుమతించా లని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ శనివారం విన్నవించారు. ఈ నెల 4న ఉదయం 6 గంటలకే జేఎన్‌టీయూలో జరిగే కౌంటింగ్ ప్రక్రియకు ఏజెంట్లు హాజరుకావాల్సి ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ ఏజెంట్లు నగరంలో ఉండేందుకు అనుమతించాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కౌంటింగ్ ఏజెంట్లు నగరంలో ఉండవచ్చని, అధికారులు ప్రశ్నించినప్పుడు ఐడీ కార్డులు చూపించాలని సూచించారు.

లాడ్జిల్లో నో స్టే

కౌంటింగ్ రోజు లాడ్జిల్లో కూర్చుని ఎన్నికల ఫలి తాలను టీవీలో చూడాలంటే కుదరదు. ఎవ రింట్లో వారు ఉండాల్సిందే. లాడ్జిల్లో అపరిచి తులు, రాజకీయ పార్టీలవారు, ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లు.. ఇలా ఎవరికీ ఈ నెల 4న లాడ్జిల్లో ఉండేందుకు అనుమతి లేదు. కలె క్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఇప్పటికే లాడ్జిల యజమానులకు అధికారులు నోటీసులు అందజేశారు. స్థానికులకు గదులు అద్దెకు ఇవ్వకూడదని వారికి స్పష్ట మైన ఆదేశాలు ఇచ్చారు. వ్యాపార లావాదేవీలు, వేరే పనుల మీద ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి మాత్రమే లాడ్జిల్లో గదులు ఇవ్వాలని పోలీసులు ఆదేశించి నట్లు సమాచారం. దీంతో కౌంటింగ్ రోజు లాడ్జిల గదులు ఫుల్ అవుతాయని, ఆదాయం రెట్టింపు అవుతుందని భావించిన యజమానులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వెంకట శివుడు యాదవ్

బయటకు రావద్దు ప్లీజ్..!

కౌంటింగ్ రోజు గొడవ పడితే కఠిన చర్యలు
కలెక్టరు, ఎస్పీ హెచ్చరిక


విలేకరుల సమావేశంలో కలెక్టరు, ఎస్పీ

అనంతపురం టౌన్, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న నాలుగో తేదీ ఎవరూ అనవసరంగా బయటకు రాకూడ దని జిల్లా కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పీ గౌతమీశాలి హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో శనివారం వారు సంయుక్తంగా కౌంటింగ్ ఏర్పాట్లపై విలేకర్ల సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు జేఎన్‌టీ యూలో పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఆరోజు ఉదయం 6గంటల నుంచి 7గంటలలోపు కేంద్రంలోకి రావాల్సి ఉంటుందన్నారు. ఆతర్వాత వస్తే అనుమతించమన్నారు. ఏజెంట్లు నిబంధనల మేరకు వ్యవహరించాలని, కేంద్రంలో గొడవలకు దిగితే బయటకు పంపిస్తామ న్నారు. అందుకే క్రమశిక్షణతో మెలిగేవాళ్లనే ఏజెంట్లుగా కౌంటింగ్‌కు పంపించాలని రాజకీయపార్టీలకు సూచించారు. జిల్లాలో పార్లమెంటు, అసెంబ్లీలకు కలిపి 113మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 2236 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈవీ ఎంలు, పోస్టల్‌బ్యాలెట్స్ కౌంటింగ్‌కు అవసరమైన గదులు, అధికా రులు, సిబ్బందిని ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకు కౌంటింగ్ పరిశీలకులు వస్తున్నారని వారి పర్యవేక్ష ణలో ఎవరెవరు ఏపనిచేయాలో కేటాయిస్తామని తెలిపారు.

పోస్టల్‌బ్యాలెట్ ఫలితాలు ఆఖరున..

పోస్టల్‌బ్యాలెట్ కౌంటింగ్ ఉదయం 8గంటల నుంచి కొనసాగించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మరోవైపు ఈవీ ఎంల కౌంటింగ్ కొనసాగిస్తామన్నారు. ఈవీఎంల కౌంటింగ్ రౌండ్ ముగిసిన తర్వాత అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామన్నారు. అయితే పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ పూర్తి అయినా కూడా చివరలో ఆయా పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లకు కలిపిన తర్వాతే ప్రకటిస్తామని కలెక్టరు తెలిపారు.

గొడవలకు దిగితే తాటతీస్తాం: గౌతమీశాలి, ఎస్పీ

కౌంటింగ్‌రోజు ఎవరైనా గొడవలకు దిగితే తాటతీస్తామని జిల్లా ఎస్పీ గౌతమీశాలి హెచ్చరించారు. నగరంతో పాటు జిల్లా అంతటా 144సెక్ష న్ అమలులో ఉంటుందన్నారు. నలుగురికన్నా ఎక్కువ మంది ఒకచోట ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా 315 సమస్యా త్మక గ్రామాలను గుర్తించి అక్కడ ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అత్యంత సమస్యాత్మక గ్రామాలలో డ్రోన్ కెమెరాలు ఎగర వేయడంతోపాటు 270 సీసీకెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎవరు ఏమిచేసినా దొరికి పోతారని ప్రతి ఒక్కరు బుద్ధిగా ఉండాలని అల్లర్లకు దిగి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ హితవు పలికారు. జేఎన్ టీయూ వద్ద ప్రత్యేక భద్రతా దళాలు ఏర్పాటు చేసి బందోబస్తు కొన సాగిస్తున్నామన్నారు. జేఎన్‌టీయులోకి ఎవరు రావాలన్నా ఐడీ కార్డు ఉంటేనే అనుమతి ఉంటుందన్నారు. అనంత జిల్లాలో ఈ జిల్లావారే ఉండాలని ఇతర జిల్లాల వ్యక్తులు కౌంటింగ్ ప్రాంతంలో గానీ, గొడ వలు జరిగేప్రాంతంలోగానీ కనిపిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. బైండోవరు అయినవారు మళ్లీ గొడవలు చేస్తే మరింత కఠినంగా శిక్షిస్తామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టరు బొల్లినేని వినూత్న, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, ఫారెస్ట్ ఆఫీసర్ వినీత్‌కుమార్ పాల్గొన్నారు.

- మొన్న వృద్ధులకు కంటి చూపు పోయింది
- ఇప్పుడు బాలింతలకు ఇన్ఫెక్షన్ సోకింది
- సర్వజన ఆస్పత్రిలో నిండా నిర్లక్ష్యం
- పరిశుభ్రతా ప్రమాణాలు లేకపోవడం వల్లే..!

ఆస్పత్రికొస్తే.. కొత్త రోగం!





అనంతపురం టౌన్, జూన్ 1: ఆస్పత్రికి వస్తే ఉన్న రోగం పోవాలి కానీ అనం తపురం పెద్దాస్పత్రికి వస్తే మాత్రం కొత్త రోగాలు తగు లుకుంటున్నాయి. ఆస్పత్రి లోని ఆపరేషన్ థియేటర్లలో పరిశుభ్రత పాటించకపోవడమే కొత్త రోగాల వ్యాప్తికి కారణమని తెలుస్తోంది. ఈ సంఘటనల్లో ఆస్పత్రి పాలనాధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. గత ఏడాది జూలైలో ఇదే ఆస్పత్రిలో పలువురికి కంటికి శస్త్ర చికిత్సలు చేసి ఇంటికి పంపారు. ఇళ్లకు వెళ్లిన తర్వాత ఐదుగురు వృద్ధులకు కళ్లు వాపులు రావడం, ఎర్రగా మారడం, మంటలు, నొప్పులు వచ్చాయి. వారిలో ఒకరిద్దరిని కుటుంబసభ్యులు తిరిగి జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా, మిగి లిన వారిని హైదరాబాద్, తిరు పతి, బెంగళూరులోని ఆస్పత్రులకు తీసుకెళ్లారు. కానీ వారికి కంటి చూపును తెప్పించలేకపో యారు. ఇందులో అనంత పురంరూరల్, ఆత్మకూరు. కనగానపల్లి, కూడేరు మండలాలకు చెందిన వారున్నారు. దీనిపై అప్పట్లో పెద్ద దుమారం రేగింది. జిల్లా కలెక్టరు నుంచి రాష్ట్ర స్థాయి అధికారులు స్పందించి విచారణకు ఆదేశించారు. జిల్లా ఆస్పత్రిలో నలుగురు సీనియర్ డాక్టర్లతో కమిటీకూడా వేశారు. ఆపరేషన్ థియేటర్‌లో నిబంధనల మేరకు పరిశుభ్రత పాటించకపోవడం వల్లే ఇన్ఫెక్షన్ సోకి ఉంటుందని నిర్ధారించారు. దాదాపు ఐదు నెలలు పాటు ఆ కంటి ఆపరేషన్ థియేటర్‌ను మూసివేయించారు. అక్కడ శుభ్రత ప్రమాణాలు తనిఖీ చేయిస్తూ, ఇన్ఫెక్షన్ లేదని తేలిన తర్వా తనే మళ్లీ కంటి ఆప


గైనిక్‌వార్డులో చికిత్స పొందుతున్న బాలింతలు

నిండా నిర్లక్ష్యమే..!

ఆస్పత్రికి వచ్చే రోగులను కొందరు డాక్టర్లు సరిగా చూడటంలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తరచూ వినిపి స్తూనే ఉన్నాయి. ఎవరైనా రోగులు చనిపోయిన సందర్భంలో కూడా డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే చనిపో యారని బాధితులు ఆందోళన చేసిన ఘట నలు కూడా ఉన్నాయి. శస్త్ర చికిత్సల విషయంలో ఎన్నో జాగ్రత్తలు పాటించా ల్సిన అధికారులు, డాక్టర్లు, సిబ్బంది వాటిని వదిలేశారనే ఆరోపణలు వినిపి స్తున్నాయి. ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయా లంటే నిబంధనల మేరకు ఆపరేషన్ థియేట ర్లను శుభ్రం చేయించాలి. అక్కడ ఎ లాంటి ఇన్ఫెక్షన్ లేదని డాక్టర్ల కమిటీ నిర్ధారించి నివేదిక ఇవ్వాల్సి ఉంటుం ది. కానీ ఇక్కడ డాక్టర్లు అలాం టి ప్రమాణాలు పాటిం చడం లేదన్న విమ ర్శలు ఉన్నాయి.

తాజాగా గైనిక్ వార్డులో బాలింతలకు...

జిల్లా ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు వికటించిన ఘటన పూర్తిగా మరువక ముందే తాజాగా గైనిక్ వార్డులలో బాలింతలకు ఇన్ఫెక్షన్ సోకుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ప్రసవం కష్టమైనపుడు పెద్దాస్పత్రిలో సిజేరి యన్ చేస్తుంటారు. ఆస్పత్రిలో రోజుకు 25నుంచి 30 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. ఇందులో కనీసం ఆరు నుంచి ఎనిమిది మంది వరకు సిజేరి యన్స్ ద్వారా ప్రసవాలు చేస్తున్నారు. అయితే ఇటీ వల కాలంలో సిజేరియన్ చేయించుకున్న బాలింత లకు కుట్లు వేసిన ప్రాంతంలో చీము పట్టి గాయాలు అయ్యాయి. ఇవి పెద్ద పుండ్లుగా మారు తు న్నాయి. వాటి చికిత్స కోసం కొందరు తిరిగి ఈ ఆస్పత్రికే వస్తున్నారు. గత పదిరోజు లుగా ఈవ్యవహారం జరుగుతున్నా బయ టకు పొక్కకుండా వైద్యాధికారులు, ఆవి భాగం డాక్టర్లు జాగ్రత్త పడుతూ వస్తున్నట్లు సమాచారం. గైనిక్ వార్డులలో పరిశుభ్రత లేక పోవడం వల్లే ఇన్ఫెక్షన్ ఏర్పడి ఆబాలింతల గాయానికి వేసిన కుట్లు పుండుగా మారాయని డాక్టర్లు నిర్ధారించినట్లు తెలిసింది.

శుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నాం



గైనిక్ వార్డులో సిజేరియన్ చేయించు కున్న కొంతమంది బాలింతలకు కుట్లు గాయాలు మానడం లేదని, చీము పడుతున్నాయని ఫిర్యాదులొచ్చాయి. కొంతమంది తిరిగి ఆస్పత్రికి రావడంతో వారికి చికిత్స అంది స్తున్నాం. డాక్టర్ల ద్వారా కారణాలు తెలుసుకోగా కొందరికి వారి శరీరతత్వం వల్ల, మరి కొందరికి అపరిశుభ్రత వల్ల కూడా వచ్చి ఉండొచ్చని నివేదించారు. అయితే గైనిక్ వార్డులను ప్రత్యేకంగా శుభ్రం చేయిస్తున్నాం. ఇప్పటికే ఒక గదిని పూర్తి శుభ్రం చేయించాం. మిగిలిన వాటిని శుభ్రం చేయి స్తున్నాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్

కూటమికే జై



అనంతపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్‌పోల్స్ ఎలా ఉంటాయనే ఆతృత అందరిలోనూ కనిపించింది. ఎగ్జిట్‌పోల్స్ ఎప్పుడు విడుదల చేస్తారా అని రాజకీయ పార్టీల నేతలే కాకుండా... ఆయా పార్టీల తరుపున ఎన్నికల పోటీలో నిలిచిన అభ్యర్థులు మొదలుకొని పార్టీల శ్రేణులు, మద్దతుదారులు చివరికి బెట్టింగ్‌రాయుళ్ల ఎదురు తెన్నులకు ఎట్టకేలకు తెరపడింది. ఎగ్జిట్ పోల్స్ కోసం నరాలు తెగే ఉత్కంఠతో ఎదురుచూసిన వారందరికి ఉపశమనం కలిగించేలా శనివారం సాయంత్రం 6.30 గంటలకు సర్వే సంస్థలు ఒక్కొక్కరుగా ఎగ్జిట్‌పోల్స్‌ను వెల్లడించాయి. మెజార్టీ సర్వేల ఎగ్జిట్‌పోల్స్ అన్నీ కూటమివైపే మొగ్గు చూపా యి. కేవలం నాలుగైదు సర్వే సంస్థలు మాత్రమే అధికార వైసీపీకి మెజార్టీ స్థానాలిచ్చారు. ఇక మిగిలిన సర్వే సంస్థలన్నీ రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టబోతోందని తేల్చి చెప్పాయి. రైస్ పొలిటికల్ రీసెర్స్, పీపుల్స్ పల్స్, చాణక్య స్ట్రాటజీస్, పీటీఎస్, పయనీర్‌పోల్ స్ట్రాటజీస్, ప్రిజమ్, ఎస్టీటీ, ఏపీ కనెక్ట్, నేషనల్ ఫ్యామిలీ, రింగ్ టు పోల్ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సర్వే సంస్థలు కూటమికే పట్టం కట్టడం గమనార్హం. ఇదిలా ఉండగా... రాష్ట్రంలో మెజార్టీ ఓటర్లు కూటమి అభ్యర్థులను గెలిపించడానికి ప్రధాన కారణాలను ఎగ్జిట్‌పోల్స్‌లో స్పష్టం చేయడం గమనార్హం. వైసీపీ ఐదేళ్ల విధ్వంసకర పాలన, వేధింపులు, అరాచకం ఒక కారణమైతే... నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకపోవడమూ మరో కారణంగా ఆ సర్వే సంస్థలు చెప్తున్నాయి. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని అవమాన



పరిచారనే ఆవేదన ప్రజల్లో ఉండటం, భావితరాల భవిష్యత్తు కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం వ్యవసాయం, నీటిపారుదల రంగాన్ని పూర్తిగా విస్మరించిన నేపథ్యంలోనే... పట్టణ ప్రాంత ఓటర్లేకాదు... గ్రామీణ ప్రాంత ఓటర్లలోనూ మార్పునకు బీజం పడిందనే అభిప్రాయాన్ని మెజార్టీ సర్వే సంస్థలు స్పష్టం చేశాయి. గత ఎన్నికల్లో మాదిరిగా... వైసీపీకి ఒక్క చాన్స్ ట్రాప్‌లో ప్రజలు పడలేదనే విషయాన్ని స్పష్టంగా సర్వే సంస్థలు వెల్లడించాయి. ప్రధానంగా ఈ ఎన్నికలు జగన్, యాంటీ జగన్, చంద్రబాబు వర్సెస్ జగన్ అన్న రీతిలో జరిగాయనంటున్నారు. ఏది ఏమైనప్పటికీ మెజార్టీ సర్వేల ఎగ్జిట్‌పోల్స్ అన్నీ కూటమిదే అధికారమని స్పష్టం చేస్తున్న నేపథ్యంలో... కూటమి పార్టీల నేతలు, ఆ పార్టీల శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

వైసీపీలో అలజడి...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐప్యాక్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంలో దేశం షాక్‌కు గురయ్యేలా ఫలితాలుంటాయని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో కంటే ఎక్కువ సీట్లు సాధించి మరోమారు అధికారంలోకి రాబోతున్నామని చెప్పారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థుల్లోనూ, శ్రేణుల్లోనూ ఉత్సాహం నెలకొంది. ఇదే క్రమంలో 9న విశాఖపట్నంలో ప్రమాణస్వీకారం చేస్తారని ఆ పార్టీ పెద్దలు కొందరు మీడియాతో వెల్లడించిన విషయం తెలిసిందే. కాగా... పోలింగ్ సరళిని చూసిన తరువాత వైసీపీ అభ్యర్థుల్లో ఓటమి భయం పట్టుకుంది. ఈ నేపథ్యంలో... సీఎం ఆ అభద్రతాభావాన్ని తొలగించేలా వ్యాఖ్యలు చేయడంతో కొంత ఊరట చెందారు. అయితే ఎగ్జిట్‌పోల్స్ ఎలా ఉంటాయోనన్న భయం మాత్రం ఆ పార్టీ అభ్యర్థులు, శ్రేణులను వీడలేదు. ఎగ్జిట్‌పోల్స్ విడుదల కావడం, మెజార్టీ సర్వే సంస్థలన్నీ కూటమికే మొగ్గు చూపడం వైసీపీలో అలజడి రాజేసిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కౌంటింగ్‌కు రెండ్రోజులు గడువున్న నేపథ్యంలో... ఎగ్జిట్‌పోల్స్ కూటమివైపే మొగ్గు చూపడం ఆ పార్టీ అభ్యర్థులు, శ్రేణులను ఉక్కిరిబిక్కిరి చేస్తోందన్న భావన ఆ పార్టీ వర్గాల నుంచే వ్యక్తమవుతుండటం గమనార్హం.

బెట్టింగ్ రాయుళ్లల్లోనూ నైరాశ్యం

వైసీపీ అధికారంలోకి వస్తుందని కొందరు, ఫలానా అభ్యర్థి గెలుస్తాడని మరికొందరు బెట్టింగ్‌రాయుళ్లు వైసీపీ పక్షాన పందెం కాసిన విషయం తెలిసిందే. కూటమిదే అధికారమని టీడీపీ పక్షాన పందెం కాసేందుకు ఎక్కువ మంది పోటీపడ్డారు. రూ. లక్షకు రూ. 1.50 లక్షలు ఇచ్చేందుకు వెనుకంజ వేయలేదు. ఈ క్రమంలో రెట్టింపు పందెం ఇస్తున్న నేపథ్యంలో... కొందరు బెట్టింగ్‌రాయుళ్లు అధికార వైసీపీ పక్షాన పందెం కాశారు. జిల్లాలో గత ఎన్నికలతో పోలిస్తే... భారీగా బెట్టింగ్ తగ్గినప్పటికీ... కొందరు మాత్రం పందెం కాసేందుకు ఉత్సాహం చూపారు. ఆయా నియోజకవర్గాల్లో పందెంరాయుళ్ల నుంచి అందిన సమాచారం మేరకు... ఒక్కో నియోజకవర్గంలో తక్కువలో తక్కువన్నా... రూ. 5 కోట్ల వరకూ పందేలు జరిగాయి. కాగా... ఎగ్జిట్‌పోల్స్‌లో మెజార్టీ సర్వే సంస్థలన్నీ కూటమిదే అధికారమని వెల్లడిస్తున్న నేపథ్యంలో... అధికార వైసీపీ పక్షాన పందెంకాసిన పందెంరాయుళ్లల్లోనూ నైరాశ్యం నెలకొంది. ఎగ్జిట్‌పోల్స్‌తో ఆశలు ఆవిరయ్యాయనే అభిప్రాయం బెట్టింగ్‌రాయుళ్ల నుంచే వ్యక్తమవుతుండటం గమనార్హం.

మెజార్టీ అసెంబ్లీ స్థానాలు కూటమికే...


జిల్లాలో 8 నియోజకవర్గాలున్నాయి. అనంతపురం పార్లమెంటు పరిధిలో అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. జిల్లా యూనిట్‌గా తీసుకున్న నేపథ్యంలో హిందూపురం పార్లమెంటు పరిధిలోని రాప్తాడు నియోజకవర్గం జిల్లా పరిధిలోకే రానుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో మెజార్టీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించబోతున్నారని ఎగ్జిట్‌పోల్స్‌లో మెజార్టీ సర్వే సంస్థలు వెల్లడించాయి. ఒక సర్వే సంస్థ అయితే ఏకంగా 8 నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులే గెలవబోతున్నారని ఎగ్జిట్‌పోల్స్‌లో వెల్లడించింది. ఉమ్మడి అనంత జిల్లాలో 14 నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు గెలుపొందుతారని ఆ సర్వే సంస్థ స్పష్టం చేయడం కూటమి అభ్యర్థులతో పాటు ఆ పార్టీ శ్రేణుల్లోనూ మరింత ఉత్సాహాన్ని నింపుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎగ్జిట్‌పోల్స్ ఎగ్జాట్ పోల్స్‌గా మారనున్నాయా..? లేదా అనేది తేలాలంటే మరో 48 గంటలు వేచి చూడాల్సిందే...



బెళుగుప్ప మండలం గంగవరంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు (ఫైల్)

పీఆర్‌లో బిల్లుల గండం..!

- రూ.60.62 కోట్ల వరకు పెండింగ్
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన నిర్మాణాలు
- అయోమయంలో కాంట్రాక్టర్లు



పెండింగ్ బిల్లుల వివరాలు

పనులు	పెండింగ్‌లో ఉన్న బిల్లులు
ప్రభుత్వ భవనాలు	రూ. 20 కోట్లు
సీసీ రోడ్లు	రూ. 22 కోట్లు
గడపగడప పనులు	రూ. 7 కోట్లు
ఎంపీ నిధులతో చేసిన పనులు	రూ.8.42 కోట్లు
సీఎండీఎఫ్ కింద చేసిన పనులు	రూ. 1.20 కోట్లు
డీఎంఎఫ్ కింద చేసిన పనులు	రూ. 2కోట్లు
మొత్తం	రూ. 60.62 కోట్లు

అనంతపురం సిటీ, జూన్ 1 : జిల్లా పంచాయతీ రాజ్‌శాఖలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల గండం పట్టుకుంది. ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో బిల్లులు ఎప్పుడు వస్తాయో..? తెలియని అయోమయంలో ఉన్నారు. శాఖ పరంగా అధికారిక లెక్కల ప్రకారం.. రూ. 60.62 కోట్లు బిల్లులు ఇప్పటికి పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా గడపగడప, ఎంపీ నిధులు, సీఎం డెవలప్‌మెంట్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పాటు వైసీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ/ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు తదితర ప్రభుత్వ భవనాల బిల్లులు సైతం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటం గమనార్హం. బిల్లుల పెండింగ్‌తో ఎక్కడికక్కడ నిర్మాణాలు ఆగిపోయాయి. ఇక నాలుగు రోజుల్లో ఎన్నికల ఫలితాలు వస్తుండటంతో బాధి త కాంట్రాక్టర్లలో మరింత కలవరం మొదలైంది. ఒకవేళ ప్రభుత్వం మారితే తమ బిల్లుల సంగతేమిటనే ఆందోళన నెలకుంది.



ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలో రోడ్లు వేస్తున్న దృశ్యం (ఫైల్)

పనుల పురోగతి అంతంతే

వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో పంచాయతీ రాజ్‌శాఖ పరంగా జిల్లా ఎక్కడా ఆశించిన స్థాయిలో పనులు చేయలేదు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, భవనాల పరిస్థితి దయ నీయంగా మారింది. పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. బిల్లుల మంజూరులో జాప్యమే ఇందుకు ప్రధాన కారణమని బాధిత కాంట్రాక్టర్లు, అధికార వర్గాల నుంచి సమాచారం. కేంద్రం మంజూరు చేసే నిధులతో చేపట్టిన పనులను కూడా రాష్ట్ర ప్రభుత్వం వేగవం తంగా చేయలేక పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల కిందట కేంద్రం నిధుల ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించదనే ఆరోపణలు లేక పోలేదు. దీంతో పీఆర్ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం అవుతోందని ఆ శాఖ వర్గాల నుంచే వినిపిస్తోంది. ప్రభు త్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ/ వార్డు సచివాల యాలు, వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌ల భవనాల నిర్మాణాలు అంతంత మాత్రం గానే సాగుతుండటం గమనార్హం. డిజిటల్ లైబ్రరీల పరిస్థితి మరీ దారుణం. మొత్తం 186 మంజూరు చేస్తే.. ఒక్కటి కూడా పూర్తి కాలేదు. అలాగే మంజూరైన 469 సచివాల యాలకు గాను 320, 411 రైతు భరోసా కేంద్రాలకు గాను 240, 326 వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్ లకుగాను 163 మాత్రమే ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తి చేసింది. మిగిలిన వాటిలో చాలా వరకు పునాదుల్లోనే దర్శనమిస్తున్నాయి. వీటిలో 288 భవనాల పనులను పూర్తిగా నిలిపి వేశారు.



డి.హీరేహాళ్ మండల పరిధిలోని పులపర్తిలో నిర్మిస్తున్న సచివాలయం (ఫైల్)

దిక్కుతోచని స్థితి..

జిల్లా పంచాయతీశాఖ పరిధిలో జరిగిన పనుల పరంగా.... అధికార లెక్కల ప్రకారం రూ. 60.62కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ వస్తుందని అధికారుల ఒత్తిళ్లతో కాంట్రాక్టర్లు.... నోటిఫికేషన్ వెలువడేందుకు ముందు నెలరోజుల పాటు హడావిడిగా పనులు చేసి బిల్లులు పెట్టారు. బిల్లులు చెల్లించే లోగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. మరో నాలుగు రోజుల్లో ఓట్ల లెక్కింపు ఉండటంతో బాధిత కాంట్రాక్టర్లలో బిల్లుల ఆందోళన మొదలైంది. ఈ ఐదేళ్ల కాలంలో ఏనాడూ చేసిన పనులకు వెంటనే బిల్లులు రాలేదు. ఇందులో వైసీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు తదితర వాటి పనులకు కూడా ఏళ్ల తరబడి బిల్లులను పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా ప్రభుత్వం మారితే.. తకు బిల్లులు వస్తాయా..? లేదా.. అనే అయోమయం కాంట్రాక్టర్లలో నెలకుంది.

బిల్లుల పెండింగ్ వాస్తవమే



జిల్లాలో జరిగిన పలు పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమే. ఇటీవల కొన్ని బిల్లులు మంజూరయ్యాయి. త్వరలోనే మిగిలినవి మంజూరవుతాయని ఉన్నతాధికారులు తెలిపారు. పెండింగ్ బిల్లుల విషయం ప్రభుత్వానికి నివేదించాం. కాంట్రాక్టర్లు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- ఈరస్వామి, ఎస్ఈ, జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ

టీబీ డ్యాంకు మొదలైన వరద



రాయదుర్గం, జూన్ 1: తుంగభద్ర జలాశయానికి వరద మొదలైంది. ఈ సీజన్‌లో తొలిసారి జలాశయంలోకి శనివారం 360 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. గత ఏడాది ఈ సమయానికి వెయ్యి క్యూసెక్కులకు పైగా వరద ఉంది. కానీ ఎగువన వర్షాలు కురవకపోవడంతో ఆశించిన స్థాయిలో వరద చేరలేదు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ప్రభావంతో జలాశయం ఎగువ ప్రాంతాలైన ఆగుంబి, శృంగేరి, తీర్థహళ్లి తదితర ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఈ కారణంగా వరదనీరు జలాశయంలోకి చేరడం మొదలైంది. ప్రస్తుతం జలాశయంలో డెడ్ స్టోరేజీ ఉంది. 1577.40 అడుగుల వద్ద 3.38 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి జలాశయంలో 4.78 టీఎంసీల నీటి నిల్వలు ఉండేవి. సాధారణంగా ఈ సమయానికి జలాశయంలో ఏడు టీఎంసీలకు పైగా నీటి నిల్వ ఉండాలి. వరద మొదలు కావడంతో బోర్డు అధికారులు జలాశయంపై నిఘా పెంచి, పర్యవేక్షిస్తున్నారు.

నాలుగు గనుల సర్వే పూర్తి



సర్వే నిర్వహిస్తున్న బృందం

రాయదుర్గం, జూన్ 1: అంతరాష్ట్ర సరిహద్దులో ఉన్న మైనింగ్ గనుల్లో నాలుగు గనుల సర్వే పూర్తి అయింది. శనివారం మూడవరోజు సర్వే ప్రక్రియను బృందం కొనసాగించింది. కర్ణాటకలో ఉన్న ఏడు మైనింగ్ గనుల్లో ఇప్పటికే నాలుగు పూర్తి అయినట్లు బృందం తెలిపింది. ముఖ్యంగా కర్ణాటకలోని టుముటి, విఠలాపురం గ్రామాలతో పాటు బేళూరు గ్రామంకు ఆనుకుని ఉన్న నాలుగు గనుల హద్దులను గుర్తించి సర్వే పూర్తి చేశారు. మిగిలిన మూడు గనుల సర్వే ప్రక్రియను సోమవారం నుంచి కొనసాగించనున్నారు. ప్రధానంగా మైనింగ్ లీజు కేటాయించేటపుడు రెవెన్యూ గ్రామ సరిహద్దులను ఆధారంగా చేసుకుని త్రవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. అదే విధంగా మరో వైపు నుంచి కొందరు మైనింగ్ యజమానులు రెవెన్యూ సరిహద్దులు దాటుకుని 300 మీటర్ల మేరకు త్రవ్వకాలు చేసినట్లు గుర్తించారు. సుప్రీంకోర్టు నిర్ణయించిన అంతరాష్ట్ర సరిహద్దును ఆనుకుని ఉన్న మైనింగ్‌లలో ఆయా యజమానుల సమక్షంలో సర్వే జరిపి ఒప్పుకున్నట్లు సంతకాలు కూడా కేంద్రం బృందం తీసుకుంటుంది. దీంతో ఇప్పటివరకు ఏడు గనులకు గాను నాలుగు గనుల హద్దులను నిగ్గుతేల్చి సర్వేను పూర్తి చేశారు. మిగిలిన మూడు గనుల సర్వేను సోమవారం నుంచి మొదలుపెట్టి ఆరవ తేదీ నాటికి పూర్తి చేయనున్నట్లు బృందం తెలిపింది. సర్వే కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ సూరత్ హర్షవర్ధన్, డీఎఫ్ఓ వినీత్‌నాయక్, సీనియర్ జియాలజిస్టు చంద్రు, సర్వేయర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు

అనంతపురం అర్బన్, జూన్ 1 : టీఎన్‌టీయూసీ జిల్లా కమిటీలో అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి చోటు లభించింది. టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వడ్డే వెంకటరాముడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా మదన్‌మోహన్‌లను నియమించారు. ఈ మేరకు టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు శనివారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

48,749 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 1 : జిల్లాలోని ఆర్బీకేల్లో శనివారం ఎనిమిదో రోజు విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి దాకా 55,318 మంది రైతులకు 48,749 క్వింటాళ్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 72,538 మంది రైతులు 64,059 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకున్నారు.

చీనీ కాయలు టన్ను రూ.38వేలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠం రూ.38వేలు, కనిష్ఠంగా రూ.15వేలు, సరాసరి రూ.24వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు.

ఓపెన్‌ఎయిర్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెట్‌గా రెహమాన్

బుక్కరాయసముద్రం, జూన్ 1: అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా జిల్లా జైలు సూపరింటెండెంట్ షఫివుల్ రెహమాన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఓపెన్‌ఎయిర్ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న చిన్నారావు శుక్రవారం పదవీరమణ చేయడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి జైలు సూపరింటెండెంట్‌గా రెహమాన్‌ను నియమించారు.

ఆర్జిత కల్యాణోత్సవ తేదీలు ఖరారు

కదిరి, జూన్ 1: పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జూన్‌నెలలో జరిగే ఆర్జిత కల్యాణోత్సవ తేదీలను ఆలయ అధికారులు శనివారం వెల్లడించారు. కల్యాణోత్సవం టిక్కెట్ ధర రూ. నాలుగు వేలు ఉంటుందన్నారు. జూన్‌లో 2, 3, 7, 10, 11, 12, 13, 14, 16, 17, 19, 20, 24, 25, 26, 27, 28వ తేదీల్లో ఆర్జిత కల్యాణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఆలయ ఈఓ కార్యాలయంలో సంప్రదించాలని వారు సూచించారు.

నలుగురిని బలితీసుకున్న ప్రమాదాలు

- ముగ్గురికి గాయాలు



సీకే పల్లి వద్ద ఆటో ప్రమాద దృశ్యం... మృతి చెందిన నారాయణ, కిష్టయ్య(ఫైల్)

చెన్నేకొత్తపల్లి, హిందూపురం అర్బన్, పుట్టపర్తి రూరల్, జూన్ 1: శ్రీసత్యసాయి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాలలో నలుగురు మృత్యువాతపడ్డారు. ముగ్గురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు ధర్మవరం పట్టణవాసులు, ఒకరు తమిళనాడువాసి, మరొకరు వైసీపీ కొత్తచెరువు మండల కన్వీనర్. గాయపడ్డ ముగ్గురు తమిళులు.

ఆటోను 407 ఢీకొట్టడంతో..

చెన్నేకొత్తపల్లి మండలం చిన్నపరెడ్డిపల్లి కాలనీ వద్ద ఆటోను 407 వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ధర్మవరం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురం కాలనీకి చెందిన గొల్ల నారాయణ(54) తన ఆటోలో ఇందిరమ్మ కాలనీకి చెందిన కె.కిష్టయ్య(67)తో కలిసి బాడుగకు కొత్తచెరువుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. చిన్నపరెడ్డిపల్లి కాలనీ వద్దకు రాగానే ధర్మవరం వైపు నుంచి ఎదురుగా వచ్చిన 407 వాహనం ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. నారాయణకు భార్య తిప్పమ్మ, ఇద్దరు కుమారులు హరీ, సురేశ్ ఉన్నారు. కిష్టయ్యకు కుమారుడు వేమనారాయణ, కూతురు పద్మావతి ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 407 వాహనం డ్రైవర్ పరారయ్యాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. .

కారు బోల్తా పడి..

పరిగి మండలం ధనాపురం సమీపంలో కారు బోల్తాపడి తమిళనాడుకు చెందిన రాజశేఖర్(50) మృతిచెందారు. తమిళమణి, సెల్వరాజ్, రామకృష్ణన్ గాయపడ్డారు. తమిళనాడులోని ధర్మపురి జిల్లా పెన్నాగరం గ్రామానికి చెందిన వీరు నలుగురూ ఎక్స్‌కవేటర్ అద్దె వసూలు చేసేందుకు శనివారం ఉదయం హోసూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు బయలుదేరారు. ధనాపురం వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో రాజశేఖర్(50) అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన ముగ్గురు గాయపడ్డారు. వీరిని హిందూపురం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ మండల కన్వీనర్..

పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ సమీపంలోని వై జంక్షన్‌లో ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీకొనడంతో వైసీపీ కొత్తచెరువు మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి (55) మృతిచెందారు. కొత్తచెరువు మండలం నారేపల్లికి చెందిన ఆయన పుట్టపర్తికి వెళుతుండగా వెలుతుండగా పుట్టపర్తి నుంచి మామిళ్లకుంట కూడలివైపు వెళుతున్న బొలెరో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన జగన్‌మోహన్‌రెడ్డిని పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి తెలిపారు.



పరిగి మండలంలో ప్రమాదానికి గురైన కారు.. గాయపడిన సెల్వరాజ్


నగరంలోని మారుతీనగర్‌లో దగ్గుపాటి పూజలు


కోర్టు రోడ్డు వరదాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం


హౌసింగ్‌బోర్డులో స్వామివారికి అభిషేకం చేసేందుకు..


మౌనగిరి క్షేత్రంలో పరిటాల సునీత పూజలు

అంజనీపుత్రుడికి భక్త నీరాజనం


ఆత్మకూరులో స్వామివారికి ఆకుపూజ


హౌసింగ్ బోర్డులో స్వామి వారి దర్శనం కోసం..


హౌసింగ్ బోర్డులో సాంస్కృతిక కార్యక్రమాలు


శింగనమలలో...

హనుమాన్ జయంతి పర్వదిన వేడుకలను శనివారం జిల్లావాసులు ఘనంగా జరుపుకున్నారు. హనుమాన్ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. హనుమద్ వ్రతాలు, ప్రత్యేక అలంకార సేవలు, ఆకుపూజలు, అన్నదాన కార్యక్రమాలతోపాటు పలు ఆలయాల్లో హోమాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అంజనీసుతుడి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నగరంలోని హౌసింగ్‌బోర్డులో భక్తాంజనేయస్వామి దేవాలయం, కోర్టురోడ్డులోని వరదాంజనేయస్వామి, కక్కలపల్లి కాలనీ ప్రజాశక్తినగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి, పాతూరులోని మూలాంజనేయస్వామి, మండి ఆంజనేయస్వామి, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, నాల్గవరోడ్డులోని కసాపురం ఆంజనేయస్వామి, ఎర్రనేల కొట్టాలలోని అభయాంజనేయస్వామి, రెవెన్యూ కాలనీ రామాలయం, హెచ్చెల్సీ కాలనీ వలీస్వామి ఆశ్రమం, శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమం, మారుతీనగర్ అభయాంజనేయస్వామి, ఐదవరోడ్డులోని పంచముఖాంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆత్మకూరు, గార్లదిన్నె, కల్లూరు, శింగనమల, బుక్కరాయసముద్రం, రాప్తాడు, నార్పల తదితర ప్రాంతాల్లో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. మౌనగిరి హనుమద్ క్షేత్రాన్ని మాజీ మంత్రి పరిటాల సునీత దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా సనకోట సమీపంలోని తిరుమల దేవస్థానంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతపురం అర్బన్ కూటమి అభ్యర్థి దగ్గుపాటి వేంకటేశ్వరప్రసాద్ మారుతీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

- అనంతపురం కల్చరల్


కల్లూరులో స్వామివారికి వడలహారం


బొందలవాడలో...


కోర్టు రోడ్డులోని వరదాంజనేయస్వామి..

అధికారంలోకి రాబోతున్నాం: దగ్గుపాటి


టీవీలో ఎగ్జిట్ పోల్స్ వీక్షిస్తున్న దగ్గుపాటి ప్రసాద్ తదితరులు

అనంతపురం అర్బన్, జూన్ 1: రాష్ట్రంలో 165 స్థానాలతో ఎన్డీయే కూటమి అధికారంలోకి రాబోతోందని కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వేంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో పలువురు టీడీపీ నాయకులతో కలిసి ఎగ్జిట్ పోల్స్‌ను టీవీలో వీక్షించారు. చాలా సర్వేలు ఎన్డీయే కూటమికి అనుకూలంగా రావడంతో నాయకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ఖచ్చితంగా అధికారంలోకి వస్తుందని మొదటి నుంచి చెబుతున్నామని, ఎగ్జిట్ పోల్స్ అదే తేల్చాయన్నారు. ఉమ్మడి అనంతజిల్లాలో రెండు ఎంపీ స్థానాలతోపాటు 14 అసెంబ్లీ స్థానాల్లోనూ కూటమి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

క్షయ పట్ల అవగాహన కల్పించాలి

రాప్తాడు, జూన్ 1: క్షయ సోకకుండా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా క్షయ వ్యాధి అధికారి అనుపమ జేమ్స్ సూచించారు. రాప్తాడు పీహెచ్‌సీ, హంపాపురం సబ్ సెంటర్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. క్షయ నివారణకు ఉపయోగించే మందులపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. క్షయ సోకిన వారు క్రమం తప్పకుండా వైద్యులు సూచించిన మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శివకృష్ణ, శ్రావణి, హెచ్‌ఈఓ సత్యనారాయణ, టీబీ సూపర్‌వైజర్ రేవతి, సీహెచ్‌ఓ శశప్రసాద్, సూపర్‌వైజర్‌లు నరసింహ, అరుణ, ఫార్మాసిస్ట్ మూర్తి సిబ్బంది శ్రీధర్, చంద్రకళ, పుష్పలత పాల్గొన్నారు.

గొడవలకు తావివ్వకండి: డీఎస్పీ

చెన్నేకొత్తపల్లి, జూన్ 1: ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటుచేయడం జరిగిందని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. గ్రామాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. అదేవిధంగా 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందన్నారు. సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. గొడవలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల: సార్వత్రిక ఎన్నికల ఫలితాల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శనివారం ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. మండలంలోని ఎవరైనా గొడవలకు దిగితే చర్యలు తప్పవన్నారు.

అక్రమాలపై విచారణ చేయాలి: ఏఐఎస్ఎఫ్

అనంతపురం విద్య, జూన్ 1: జిల్లా సాధారణ పరీక్షల మండలిలో అనేక అక్రమాలు జరిగాయని, విచారణ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం నాయకులు డీఈఓను కలసి వినతిపత్రం ఇచ్చారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి కుల్లాయిస్వామి మాట్లాడుతూ డీసీఈబీలో 2023-24లో పదో తరగతి విద్యార్థులకు అనంత సంకల్పం మెటీరియల్ సరిగ్గా పంపిణీ చేయలేదన్నారు. వంద రోజులు ముందుగా ఇవ్వాల్సిన మెటీరియల్‌ను ఆలస్యంగా పంపిణీ చేశారన్నారు. పైగా అరకొర కాపీలు విద్యార్థులకు. అందించి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లా 24వ స్థానానికే పరిమితం అయ్యిందన్నారు. దీనికి కారణం డీసీఈబీ, జిల్లా విద్యాశాఖాధికారులేనన్నారు. అనంత సంకల్పం స్టడీ మెటీరియల్ పంపిణీలో తప్పుడు లెక్కలు, తప్పుడు నివేదికలు చూపించి లక్షలాది రూపాయలు స్వాహా చేశారన్నారు. అదేవిధంగా ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల పేపర్ల వెనుక కూడా భారీగా అక్రమాలు జరిగాయన్నారు. విద్యార్థుల నుంచి భారీగా సొమ్మును వసూలు చేశారంటూ మండిపడ్డారు. డీసీఈబీ వెనుక జరిగిన అక్రమాలపై వెంటనే విచారణ చేయించాలన్నారు. డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం బాబును వెంటనే సస్పెండ్ చేశారని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మంజునాథ్, పవన్, రారాజు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ముగిసే వరకు చిత్తశుద్ధితో పనిచేయండి


జేఎన్‌టీయూ వద్ద పోలీసు బందోబస్తు


తనిఖీచేసి లోపలకు పంపుతున్న పోలీసులు


అడ్డుగా వేసిన ముళ్ల కంచె

డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం క్రైం, జూన్ 1: కౌంటింగ్ ముగిసేవరకు అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమిశాలి సూచించారు. శనివారం కౌంటింగ్ జరిగే అనంతపురం జేఎన్టీయూ పరిసరాలను డీఐజీ, ఎస్పీ పరిశీలించారు. కౌంటింగ్ రోజున జిల్లాను ప్రశాంతంగా ఉంచడమే లక్ష్యమని, సమష్టిగా శ్రమిద్దామన్నారు. కౌంటింగ్ ముగిసే వరకు ఎవరికి అప్పగించిన విధులు వారు సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు.

పోలీసు బలగాలు రెడీ... ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా నిలువరించడానికి పోలీసు బలగాలు సిద్ధమయ్యాయి. పోలీస్ సిబ్బంది స్టోన్ గార్డులు, బాడీ ప్రొటెక్టర్స్, హెల్మెట్లు, లాఠీలు, రోప్‌లు, డ్రాగన్ లైట్లు దగ్గర ఉంచుకుని విధుల్లో పాల్గొననున్నారు. అధునాతన ఆయుధాలు ధరించిన కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు, వజ్ర, వాటర్ కేనన్ వాహనాలు సిద్ధంగా ఉంచుకున్నారు. జనాలను చెదరగొట్టడం కోసం మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ వాహనాలకు సైరన్‌తోపాటు పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. అల్లర్లు, గొడవలు, హింసాత్మక ఘటనల సమయాల్లో పరిస్థితులను అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు వినియోగించే గ్యాస్ గన్లు, యాంటీ రైట్ గన్‌లు, ప్లాస్టిక్ పిల్లెట్స్, బాలిస్టిక్ క్యాట్రిడ్జిలు రిహార్సల్స్ సందర్భంగా ఉంచుకున్నారు.

నలువైపులా నిఘా.... కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించే జేఎన్టీయూ చుట్టూ నలువైపులా పోలీసులు నిఘా ఉంచారు. జేఎన్టీయూ సమీపంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. లోపలికి వెళ్లేవారు ఎన్నికల విధుల్లోని సిబ్బంది, అందులోనూ ఐడీ కార్డు ఉంటేనే అనుమతిస్తున్నారు. మీడియా వారిని సైతం అనుమతించలేదు. చుట్టూ ఉన్న ప్రజలకు పలు సూచనలు చేశారు. 4వతేదీ రోజు బయటకు రాకుండా సంయమనం పాటించాలని, సహకరించాలని సూచించారు. సీసీ కెమెరాలు 360 డిగ్రీలో పనిచేసేలా నలువైపులా ఉంచారు.

ఒకరి బదులు మరొకరు పరీక్ష రాస్తూ...

రెడ్‌హ్యాండెడ్‌గా డీఈఓకు చిక్కిన వైనం

అనంతపురం విద్య, జూన్ 1: ఒకరి స్థానంలో మరొకరు వచ్చి పరీక్ష రాశారు. ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఓపెన్ టెన్త్‌తోపాటు, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 7 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. అనంతపురం నగరంలో 4 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుంటే రాయదుర్గం, తాడిపత్రిలోని మరో మూడు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. అనంతపురం నగరంలోని శారద స్కూల్‌లో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రంలోని ఒక సెంటర్‌లో ఒక విద్యార్థి బదులు మరో విద్యార్థి పరీక్ష రాసేందుకు హాజరైనట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. డీఈఓ తనిఖీలో విషయం బహిర్గతమైనట్లు తెలిసింది. రాజేంద్ర మున్సిపల్ హై స్కూల్ పరీక్షా కేంద్రంలో తనిఖీల తర్వాత డీఈఓ శారద స్కూల్ విజిట్‌కు వెళ్లారు. ఆ సెంటర్‌లో ఒకరి బదులు మరొకరు పరీక్షలు రాస్తుండటం ఆమె గుర్తించినట్టు తెలిసింది. విద్యార్థిని ఏం చదువుతున్నా..? మీ తల్లిదండ్రుల పేర్లు ఏంటి అంటూ ప్రశ్నించడంతో ఆ విద్యార్థి తడబడటంతో విషయం బయటపడినట్లు తెలిసింది. ఒకరి బదులు మరొకరు ఎలా రాస్తారంటూ డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అయితే ఆ కేంద్రంలోని కొందరు పరీక్షల విధులకు వచ్చిన అధికారులు ఈ విషయం బయటకు పొక్కకుండా విశ్వప్రయత్నాలు చేసినట్టు సమాచారం. ఈ ఘటనపై వివరణ కోరడానికి డీఈఓకు ఫోన్ చేయగా డీఈఓ అందుబాటులోకి రాలేదు.

ఘనంగా పర్వతనేని శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు


టీడీపీ జిల్లా అధికారప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బుక్కరాయసముద్రం, జూన్ 1: టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతినేని శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను శింగనమల నియోజకవర్గ టీడీపీ నేతలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి వద్ద కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఉదయం అనంతపురంలోని అనాథపిల్లల ఆశ్రమంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కూటమి అభ్యర్థి శ్రావణిశ్రీ, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగ కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, ఆలం వెంకటనరసానాయుడు, మండల కన్వీనర్ అశోక్, టీడీపీ నేతలు లక్ష్మీనారాయణ, కేశన్న, రామానాయుడు, ఎస్‌నారాయణస్వామి, మల్లిఖార్జునరెడ్డి, ఓబులపతి, మల్లేష్, నరేంద్రయాదవ్, గోపాల్‌నాయుడు, సురేష్ చౌదరి, సోముశేఖర్, వడ్డే రామక్రిష్ణ, రెడ్డిపల్లి నాయుడు, ధను, విజయ్, శ్రీనాథ్ తదితరులు పర్వతనేని శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

నిల్వ నీటితోనే జ్వరాలు

శింగనమల జూన్ 1: తొట్టెలలో నీటిని నిల్వ చేయడం ద్వారా దోమలు వృద్ధిచెంది జ్వరాలకు కారణమవుతాయని జిల్లా మలేరియా సహాయ అధికారి సత్యనారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలోని చక్రాయపేటలో మలేరియా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధికాకుండా అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటిని తొట్టెలలో నిల్వ ఉంచకూడదన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమాశంకరమ్మ, తరిమెల మెడికల్ అధికారి డాక్టర్ శంకర్‌నాయక్, గంగాధర్, శ్రీధర్, అశ్వత్థనారాయణ, మద్దయ్య, ఉమాదేవి, హేమా తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 1: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక హౌసింగ్ బోర్డులోని ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఇండియన్ రెడ్‌క్రాస్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత, భక్తులు అధిక సంఖ్యలో రక్తదానం చేశారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత భరత్, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, ఆలయ కమిటీ ధర్మకర్త పరుచూరి రమేష్ రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

నీలం సేవలు మరువలేనివి

గార్లదిన్నె, జూన్ 1: మాజీ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డి దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తరిమెల కోనారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో నీలం సంజీవరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఏకే. నరసింహులు, మాజీ సర్పంచ్ పెద్దన్న, బృందావన్ రామాంజి పాల్గొన్నారు.


కల్లూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

కౌంటింగ్‌కు సహకరించండి: కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 1: ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో అభ్యర్థులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4న జరిగే కౌంటింగ్‌కు నియమించిన ఏజెంట్లు ఉదయం 6-30గంటలకల్లా అందుబాటులో ఉండాలన్నారు. తాడిపత్రి ఆర్ఓ రాంభూపాల్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుంటే బదిలీ చేయడం జరిగిందన్నారు. ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టరు శిరీషాను నియమించడం జరిగిందన్నారు. తొలుత పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపు మొదలు పెట్టడం జరుగుతుందన్నారు. అరగంట తర్వాత ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఏజెంట్లు బయటకు రాకూడదని, అక్కడికే భోజనం, స్నాక్స్ పంపించడం జరుగుతుందన్నారు. క్రమశిక్షణతో ఉండే వారిని మాత్రమే కౌంటింగ్‌కు ఏజెంట్లుగా పంపించాలని సూచించారు. ఏదైనా ఇబ్బందులు కలిగించినా వాయిస్ పెంచినా బయటకు పంపిస్తామన్నారు. అభ్యర్థులు గెలిచిన తర్వాత అందుబాటులో ఉండి డిక్లరేషన్ సర్టిఫికెట్లు తీసుకోవాలన్నారు.

అనంత, చిత్తూరు జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 1: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్ జోన్ అండర్-19 వన్డే క్రికెట్ పోటీల్లో అనంతపురం, చిత్తూరు జట్లు విజయం సాధించాయి. శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 వన్డే క్రికెట్ పోటీలు కొనసాగాయి. అనంతపురం, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 49.2ఓవర్లలో 197పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు జట్టు 34.4ఓవర్లలో 148పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతపురం జట్టు 49పరుగుల తేడాతో విజయం సాధించింది. అనంతపురం బౌలర్ సాహిల్ 4 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. మరో మ్యాచ్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 274 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 33.2ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 278పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. చిత్తూరు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సెంచరీ కొట్టిన రుషీల్‌రెడ్డి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలపై విజిలెన్స్ దాడులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 1: జిల్లా కేంద్రంలో శనివారం విజిలెన్స్ అధికారులు విత్తన దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్టాండులోని కోకిల సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, శ్రీలేఖ ఫర్టిలైజర్స్ తదితర దుకాణాల్లో తనిఖీ చేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఇందులో వ్యత్యాసం ఉండటంతో స్టాప్‌సేల్ నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో సీఐ వెంకటరమణ, ఏఓ వాసుప్రకాష్, ఎంఏఓ శశికళ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం, జూన్ 1: అనంతపురం సెబ్ పోలీసులు కర్ణాటక మద్యం పట్టుకున్నారు. శనివారం సెబ్ ఏఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో సీఐ యల్లయ్య సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అనంతపురంలోని వికలాంగుల కొట్టాలకు చెందిన దేవరకొండ చంద్ర, మాల జెన్ నుంచి 5 కర్ణాటక మద్యం బాక్సుల్లో 480 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కూడేరు మండలం మరుట్ల-2 గ్రామానికి చెందిన ఎరుకల శివయ్య ఆటోలో తరలిస్తున్న 14 కర్ణాటక మద్యం బాక్సుల్లోని 1344(90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు, ఆటోను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వీటి విలువ రూ.1,23,120 ఉన్నట్లు సీఐ తెలిపారు. కూడేరు, అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించడానికి తరలిస్తుండగా పట్టుబడినట్లు సీఐ వివరించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

శింగనమల జూన్ 1: మండలంలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓలు నరసింహరాజు శివప్రసాద్ ఆదేశించారు. శనివారం శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో ఏజెన్సీలు, హెచ్ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన ఏజెన్సీలు మెనూ మేరకు భోజనం విద్యార్థులకు అందించాలన్నారు.

అనంతలో ఓ మోస్తరు వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 1 : నగరంలో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో నగరంలోని పలు డివిజన్లలో రాత్రి 10.40 నుంచి అర్ధరాత్రి వరు విద్యుత్ సరఫరాను ఆ శాఖాధికారులు నిలిపివేశారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే పామిడి, తాడిపత్రి, గార్లదిన్నె, కూడేరు తదితర ప్రాంతాలలో ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది.

ఒక్క రాయీ ఉండకూడదు..!


మైదానంలో రాళ్లను ఏరిపారేస్తున్న సిబ్బంది

తాడిపత్రిటౌన్, జూన్ 1: ఎన్నికల నేపథ్యంలో జరిగిన రాళ్లదాడులను దృష్టిలో ఉంచుకొని శనివారం మున్సిపల్ కార్మికులు చిన్నరాయిని వదలకుండా ఏరిపారేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది ట్రాక్టర్ ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న పెద్ద పెద్దరాళ్లే కాకుండా చిన్నసైజు రాళ్లను కూడా ఏరేస్తున్నారు. మరోరెండురోజుల్లో ఎన్నికల ఫలితాలు రానుండడంతో ముందస్తు చర్యగా పట్టణంలో ప్రధాన కూడళ్లలో ఉన్న రాళ్లను ట్రాక్టర్ సాయంతో తరలిస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసాల వద్ద, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉన్న రాళ్లను వెతికి ఎక్కడ చిన్న గులకరాయి కూడా లేకుండా చేశారు. మైదానంలో ఉన్న పిచ్చిచెట్లు, ముళ్లపొదలను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించి శుభ్రం చేశారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూం పరిశీలన


జేఎన్‌టీయూలో ఈవీఎం స్ట్రాంగ్ రూంను సందర్శించిన గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, జూన్ 1: మరో రెండు రోజుల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా గుంతకల్లు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం శనివారం సాయంత్రం అనంతపురంలో భద్రపరచిన ఈవీఎంలను పరిశీలించారు. జేఎన్‌టీయూకు వెళ్లిన జయరాం గుంతకల్లు నియోజకవర్గ ఈవీఎంలను, అక్కడ ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల నిఘా పరిస్థితిని పరిశీలించారు. జయరాం కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్, టీడీపీ చీఫ్ ఎలెక్షన్ ఏజెంట్ బీఎస్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న మద్యం

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 1: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 48 గంటల ముందు మద్యం దుకాణాలు మూతబడనున్నాయి. ఈ నేపథ్యంలో మద్యం దుకాణంలో పనిచేసే సిబ్బంది మద్యాన్ని పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పెద్దఎత్తున గ్రామాలలో నిర్వహించే బెల్ట్ షాపులకు కమీషన్లకు కక్కుర్తిపడి లోపల మద్యాన్ని పంపుతున్నారని ఆరోపణలు పట్టణంలో జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొరకని మందు కూడా తెల్లవారుజామున 5 నుంచే మద్యం దుకాణానికి సమీపంలో బహిరంగంగా లక్షల్లో విలువ చేసే మద్యాన్ని విక్రయిస్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని చుట్టుపక్కల నివాసం వుంటున్న ప్రజలు చర్చించుకోవడం గమనార్హం. దీనికి తోడు ఎస్వీ బార్ అండ్ రెస్టారెంట్‌లో ధరలకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందని మందుబాబులు వాపోతున్నారు. 720 ఎంఎల్ బాటిల్‌పై రూ.వెయ్యి అదనంగా వసూలు చేస్తున్నారు. మామూళ్ల మత్తులో పడి ఎక్సైజ్ అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నారంటూ మందుబాబులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మార్పీని రెట్టింపు చేస్తూ మందు అమ్మడం ఏమిటని ప్రశ్నిస్తే ఎవరికైనా ఫిర్యాదు చేసుకోండి అంటూ బెదిరింపు ధోరణిలో ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కూడేరు, జూన్ 1: మండలంలోని కమ్మూరు గ్రామానికి చెందిన వీరనారప్ప (40) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకోవడంతో చుటుపక్కల వారు గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. ఇంట్లో తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. వీరనారప్ప భార్య పిల్లలు పుట్టింకి పోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

36 మంది బైండోవర్

బెళుగుప్ప, జూన్ 1: మండలంలో 36 మందిని శనివారం బైండోవర్ చేసి మండల మేజిస్ట్రేట్ హరనాథరావు ఎదుట హాజరుపరచినట్లు ఎస్ఐ శివ తెలిపారు. రమణేపల్లి, నరసాపురం గ్రామాలకు చెందిన ఇరుపార్టీ నాయకులను బైండోవరు చేశామని, ఇప్పటివరకు మండలంలో 372 మందిని బైండోవర్ చేశామన్నారు.

కారు.. ఐచర్ ఢీ.. ఒకరి మృతి

తాడిపత్రిటౌన్, జూన్ 1: మండలంలోని వంగనూరు గ్రామసమీపంలో శనివారం తెల్లవారుజామున కారు-ఐచర్ ఢీకొన్న సంఘటనలో పట్టణంలోని అంభాభవాని వీధికి చెందిన సుబ్బయ్య (35) మృతిచెందాడు. శ్రీనివాసపురానికి చెందిన రామకృష్ణారెడ్డి, ఆర్డీటీ కాలనీకి చెందిన వెంకటేష్ గాయపడ్డారని రూరల్ పోలీసులు తెలిపారు. సుబ్బయ్య కొన్నేళ్లక్రితం కడపజిల్లా వల్లూరు మండలం దుగ్గయ్యపల్లి గ్రామం నుంచి ఉపాధినిమిత్తం తాడిపత్రికి వలస వచ్చాడు. బిల్డర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సుబ్బయ్య అతని మిత్రులతో కలిసి వ్యక్తిగత పని నిమిత్తం సొంత గ్రామమైన దుగ్గయ్యపల్లికి కారులో వెళ్లాడు. తిరుగుప్రయాణంలో వంగనూరు గ్రామ సమీపంలోకి రాగానే ఐచర్ ఢీకొనడంతో అక్కడికక్కడే సుబ్బయ్య మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని తాడిపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. సుబ్బయ్యకు భార్య సుభాషిణి, కుమారుడు చక్రి, కుమార్తె హరిత ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పిడుగు పాటుకు ఎద్దు మృతి

గుత్తిరూరల్,జూన్ 1: మండలంలోని పెద్దొడ్డి గ్రామాశివారులో శనివారం సాయంత్రం పిడుగు పడి ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన నీలకంఠ గౌడ్ తన ఎద్దులను వామి దొడ్డిలో కట్టేశాడు. సాయంత్రం ఉరుములు మేరుపులతో పిడుగుపడటంతో ఎద్దు మృతి చెందింది. రూ. 60 వేలు విలువ చేస్తుందని రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.

దారి దోపిడీ దొంగల అరెస్ట్


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

గుంతకల్లుటౌన్, జూన్ 1: గుంతకల్లు-గుత్తి ఎన్‌హెచ్ 67 హైవే నక్కనదొడ్డి గ్రామసమీపంలోని సుధాకర్ రెడ్డి కోళ్ల ఫారం వద్ద లారీ డ్రైవర్, క్లీనర్‌ను బెదరించిన సంఘటనలో ఇద్దరు దొంగలను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ వివరాలను శనివారం సీఐ మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం హొసపేటలో ఓ ఫ్యాక్టరీ నుంచి లారీ స్లాగ్ లోడుతో జమ్మలమడుగులోని దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీకి గురువారం సాయంత్రం బయలుదేరారు. రాత్రి నక్కనదొడ్డి గ్రామ సమీపంలోని సుధాకర్ రెడ్డి కోళ్లఫారం వద్ద బొలెరో వాహనం వెనుక నుంచి ఓవర్‌టేక్ చేసి లారీని అడ్డుకున్నారు. డ్రైవర్ లారీని ఐఓసీ డిపో వద్ద పక్కన ఆపారు. బొలెరో వాహనంలో నుంచి ముగ్గురు వ్యక్తులు డ్రైవర్ ఇసాక్, క్లీనర్ సునీల్‌తో వాదనకు దిగి వారిని కిందకు లాగి చితకబాదారు. వారి వద్ద డబ్బులు లేకపోవడంతో రెండు సెల్‌ఫోన్లను లాక్కొని పరారయ్యారు. లారీ డ్రైవర్ ఇసాక్ శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్ దారి దోపిడీ దొంగల కోసం గాలింపు చేపట్టామన్నారు. శుక్రవారం రాత్రి 8.30 గంటలకు నలుగురు వ్యక్తులు ముగ్గులు వ్యక్తులు తెల్ల బొలెరో వాహనంలో గుత్తి నుంచి బళ్లారికి వెళ్తుండగా గొల్లలదొడ్డి క్రాస్ వద్దవారిని గుర్తించామన్నారు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన చిన్న కందుకూరి అజేయ్, బెల్లంప్రశాంత్, గుత్తిమండలం లచ్చానుపల్లికి చెందిన వడుగూరు ఆదర్శలను అరెస్ట్ చేశామన్నారు. మరో వ్యక్తి జీవన్‌కుమార్ పరారీలో ఉన్నాడన్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు.

వైభవంగా హనుమజ్జయంతి

హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో శనివారం ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రసిద్ధి చెందిన నేమకల్లు, మురడి ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆయా ఆలయాల్లో నిర్వాహకులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్ని ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


రాయదుర్గం రూరల్: పల్లకి సేవలో పాల్గొన్న కాలవ శ్రీనివాసులు


కూడేరులో...


బొమ్మనహాళ్: మడుగుతేరును లాగుతున్న భక్తులు


తులసీదళాల అలంకరణలో నేమకల్లు ఆంజనేయుడు


డీ హీరేహాళ్: అలంకరణలో మురడి ఆంజనేయుడు


విడపనకల్లులో...


ఉరవకొండలో...


పామిడిలో...


గుత్తిరూరల్ జక్కలచెరువులో...


బెళుగుప్పలో...



తాడిపత్రిటౌన్: పంచముఖ, పుట్లూరు రోడ్డు ఆంజనేయస్వామి


యల్లనూరులో...

రబీ పంట నష్టపరిహారం రూ.36 కోట్లకు ప్రతిపాదనలు


మాట్లాడుతున్న జేడీ ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ, జూన్ 1: రబీలో పంట నష్ట పరిహారానికి సంబంధించి రూ.36.84కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశభవనంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులతో మాట్లాడి ఖరీఫ్ సీజన్‌లో ఏఏ గ్రామాలలో పంట సాగు అయ్యిందో వాటి వివరాలను తెలుసుకున్నారు. డీఆర్సీ ఏడీఏ శైలజ కృషి విజ్ఞానం ఏవో మల్లికార్జున హాజరయ్యారు. ఖరీఫ్‌లో సాగు చేసే పంటల వివరాలను రైతులకు వివరించారు. విత్తనం ఎంత వాడాలి, ఎరువులను ఎంతమోతాదులో వాడాలో తెలియజేశారు. అనంతరం జేడీఏ విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో 3.70లక్షల హెక్టార్లలో పంటలు సాగు అవుతాయన్నారు. వాటిలో వేరుశనగ, సాధారణ విస్తీర్ణం 1.97లక్షల హెక్టార్లు అన్నారు. జిల్లాకు 76,710 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు కేటాయించారన్నారు. రైతులకు రూ.2500కోట్ల పంటనష్ట పరిహారాన్ని రైతుల ఖాతాల్లోకి జమచేశామన్నారు. రబీకి సంబంధించి 14 మండలాల్లో 37,195హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. రూ.36కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. సమావేశంలో ఏడీ పద్మజ, ఏవోలు శుభకర్, పెన్నయ్య పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ


ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ. జూన్ 1: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో ఆరోగ్యానికి ముప్పు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ, జూన్1: పొగాకు వాడకానికి దూరంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యులు పావని తెలిపారు. మండలంలోని రాకెట్ల గ్రామంలో శనివారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేకదినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొగాకు వాడడం వలన తీవ్ర ప్రభావాలు ఉంటాయన్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. సీహెచ్‌వో నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, సిబ్బంది భారతి, భగవాన్‌దాస్ మంగమ్మ పాల్గొన్నారు.

ఘనంగా రోషన్‌వలీ బాబా ఉరుసు

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 1: పట్టణంలోని హజరత్ సయ్యద్ జలాలి రోషన్ వలీ బాబా ఉరుసు వైభవంగా జరిగాయి. ఏటా కన్నుల పండువగా దర్గా వన్నూరు స్వామి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో మతాలకు అతీతంగా ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని భక్తులు భారీ సంఖ్యలో పాల్గొంటారు. వివిధ రకాల అలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో రోషన్ వలీ కొండలో కోలాహలంగా అనిపించింది. సంతానం లేని వారు మొక్కుకుని ప్రత్యేక పూజలు చేస్తే సంతానం కలుగుతారని భక్తుల విశ్వాసం.

ముగ్గురికి జరిమానా

పుట్లూరు, జూన్ 1: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముగ్గురికి శనివారం జరిమానా విధించినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఎన్నికల ముందు బైండోవర్ అయి అనంతరం ఎన్నికల్లో ఘర్షణకు దిగిన సురేష్, నరసింహారెడ్డి, కేశవరెడ్డిలకు తహసీల్దార్ రూ.లక్ష జరిమానా నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

గాలివానకు నేలకొరిగిన చెట్లు


రోడ్డుకు అడ్డంగా పడిన వేపచెట్టు కొమ్మలను తొలగిస్తున్న పోలీసులు

యల్లనూరు, జూన్1: మండలంలో శనివారం సాయంత్రం గాలి బీభత్సానికి పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. యల్లనూరు-తాడిపత్రి రహదారిలోని 85 నిట్టూరు గ్రామం వద్ద వేపచెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో రాకపోకలు స్తంభించాయి. యల్లనూరు పోలీసులు గ్రామస్థుల సాయంతో వెంటనే వాటిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి: ఈఆర్వో


మాట్లాడుతున్న ఈఆర్వో కరుణకుమారి

రాయదుర్గంరూరల్, జూన్ 1: కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఈఆర్వో కరుణకుమారి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల నియమ నిబంధనలపై ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రంల ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఏజెంట్ తప్పనిసరిగా ఎన్నికల సంఘం గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, పాసుపోర్ట్ సైజ్ ఫొటోలు తమ వెంట తీసుకోవాలన్నారు. తహసీల్దార్ చిట్టిబాబు, అర్బన్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్, ఆయా రాజకీయ పార్టీల నాయకులతో పాటు కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని దేవాంగ కల్యాణ మండపంలో శనివారం ఏజెంట్లకు ఆర్వో, జేసీ కేతన్‌గార్గ్ కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఏజెంట్లు లేవనెత్తిన అంశాలపై ఆయన నివృత్తి చేశారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో ఎటువంటి ఆటంకాలు కలిగించరాదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కౌంటింగ్ హాల్ నుంచి బయటకు పంపుతామన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి 18 టేబుళ్లు ఏర్పాటు చేశామని 15 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. తహసీల్దారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు: ఏఎస్పీ


సీఐలతో మాట్లాడుతున్న ఏఎస్పీ

గుంతకల్లు టౌన్, జూన్ 1: కౌంటింగ్ రోజు గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎన్నికల కౌంటింగ్ రోజున తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడదన్నారు. 30 పోలీస్ యాక్టు అమల్లో ఉందని పోలీసుల ముందస్తు అనుమతి లేనిదే ర్యాలీలు, సమావేశాలను నిర్వహించరాదన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నప్పుడు కానీ, తరువాత కానీ ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదన్నారు. ఎన్నికల ఫలితాల రోజున విద్యార్థులు, యువత అనవసరంగా రోడ్లపైకి వచ్చి గొడవల్లో ఇరుక్కొని మీ బంగారు భవిష్యతను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం మొబైల్ పార్టీలు, క్యూఆర్‌టీ టీం, రక్షక్, బ్లూకోల్ట్ టీమ్‌తో సమావేశం అయ్యారు. సీఐలు రామసుబ్బయ్య, గణేష్, మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐలు సురేష్, దుగ్గిరెడ్డి, రంగస్వామి పాల్గొన్నారు.

విడపనకల్లు: కౌంటింగ్ రోజు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిషేధించినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో విడపనకల్లు ఎస్ఐ ఖాజా హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బలగాలుతో ఆయా గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు 4వ తేదీన విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ప్రజలు ఎన్నికల కోడ్‌ను గుర్తుంచుకుని పోలీసులకు సహకరించాలన్నారు. ప్రత్యేక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: ఎన్నికల కౌంటింగ్ రోజున ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నబీరసూల్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో రాజకీయ పార్టీల నాయకులతో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ కౌంటింగ్ రోజున 144సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమల్లో ఉందన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: ఎగ్జిట్ పోల్స్ విడుదల సందర్భంగా ఎటువంటి హింసాత్మక ఘటనలకు పాల్పడకుండా ప్రజలు దూరంగా వుండాలని పోలీసులుసూచించారు. శనివారం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలో ఫ్లాగ్ మార్చ్, మాక్‌డ్రిల్‌తో ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎగ్జిట్ పోల్స్ ఫలితాల కోసం ప్రజలు ఎదురుచూస్తూ వుండటంతో గొడవలకు పాల్పడకుండా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు 4వ తేదీన విడుదలవుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కార్డెన్ సెర్చ్ చేశారు. ప్రజలందరూ స్వేచ్ఛా వాతావరణంలో వుండాలని ఎవరైనా గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


కళ్యాణదుర్గంలో సోదాలు చేస్తున్న పోలీసులు

చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయం


పూజల్లో పాల్గొన్న కాలవ భరత్, టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, జూన్ 1: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలోకి అడుగుపెట్టడం ఖాయమని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ అన్నారు. శనివారం మండలంలోని నేమకల్లు గ్రా మంలో ఆంజనేయస్వామి వారికి హనుమజ్జయంతి సందర్భంగా పూజలు జరిపించారు. 4వ తేదీన వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో టీడీపీ విజయ ఢంకా మోగించాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, రాయదుర్గం ఎమ్మెల్యేగా కాలవ శ్రీనివాసులు గెలుపొంది అసెంబ్లీలోకి అడుగు పెట్టాలన్నారు. 4న రాష్ట్రాన్ని పట్టిన చీకటి తొలగిపోతుందని అన్నారు. తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షులు ఎర్రగుంట్ల వెంకటేశులు, టీడీపీ నాయకులు కొత్తపల్లి తిమ్మరాజు, ముల్లంగి నారాయణస్వామి, మహేంద్ర, మాజీ సర్పంచ్ బెళ్లి హనుమంతరెడ్డి, మల్లీడు శీన, క్లస్టర్ కన్వీనర్ మాలపాటి ధనుంజయ, ఐటీడీపీ అధ్యక్షులు కుమార్, భరత్, తిప్పేస్వామి, రమేష్ పాల్గొన్నారు.

సాగుకు అన్నదాతల సమాయత్తం


పొలంలో ఆముదం విత్తనాలు విత్తుతున్న రైతులు

ఉరవకొండ,జూన్1: ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. వారం రోజుల క్రితం వర్షాలు కురవడంతో రైతులు పొలాలను దుక్కిదున్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్‌లో 70,843 హెక్టార్లలో పంటను సాగు చేయనున్నారు. అందులో వేరుశనగ 19517హెక్టార్లు, కంది 29,108, ఆముదం 6,555, పత్తి 10,049, వరితో పాటు ఇతర పంటలు 14,594హెక్టార్లలో సాగవుతాయన్నది వ్యవసాయధికారుల అంచనా. రైతులు కంది, ఆముదం పంటలను సాగుచేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పట్టణ శివారులోని పొలాల్లో కొంత మంది రైతులు ఆముదం పంటను వేశారు. వేరుశనగ పంటకు పెట్టుబడులు పెరగడంతో పాటు, దిగుబడులు తగ్గడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. నాలుగేళ్ల నుంచి కంది సాగు కలిసి రావడంతో ఉరవకొండ వజ్రకరూరు మండలాల్లో ఈ పంటను వేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అవసరమైన విత్తనాలను తెలంగాణ నుంచి కొనుగోలు చేస్తున్నారు.

ఉపాధి పనుల్లో అవినీతిపై ఫిర్యాదు

పుట్లూరు, జూన్ 1: మండలంలోని సూరేపల్లి పంచాయతీలో నిర్వహించే ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని శనివారం ఆ గ్రామస్థులు ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందికి ఫిర్యాదుచేశారు. గ్రామంలో 100మంది ఉపాధిపనికి వస్తే మస్టర్లలో మాత్రం 200 మంది ఉన్నారని ఆరోపించారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టానుసారంగా పనికి రాని వ్యక్తుల పేర్లు రాసి వారితో సగం డబ్బులు తీసుకున్నట్లు విమర్శించారు. పనికి వెళ్లినా కూడా ఎంపీడీఓ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ పేరుపై రూ.50 ఇవ్వాల్సిందేనని లేకపోతే డిమాండ్ నోటీసు, మస్టర్లు ఇవ్వరని ఆరోపించారు. దీనిపై ఏపీఓ భాగ్యలక్ష్మిని వివరణ కోరగా నా దృష్టికి రాలేదన్నారు. వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన

విడపనకల్లు, జూన్ 1: బాల్య వివాహాలు నిర్వహించ రాదంటూ స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీల అధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సూపర్‌వైజర్ ఉమారాణి మాట్లాడుతూ బాలికలకు చిన్న వయస్సులోనే వివాహాలు చేయరాదన్నారు. యుక్త వయస్సు వచ్చేవరకు వివాహం చేయకూడదని సూచించారు. విడపనకల్లు, పెద్ద కొట్టాలపల్లి, సెక్టార్ మహిళలు, సూపర్ వైజర్లు హసీనా, ఔట్రీచ్ వర్కర్ రమాదేవి, వివిధ గ్రామాల అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులను బడిలో చేర్పించండి

బొమ్మనహాళ్, జూన్ 1: దివ్యాంగులను ఇంటికే పరిమితం చేయకుండా బడిలో చేర్పించాలని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు సహిత విద్యా రిసోర్స్ పర్సన్లు రాంప్రసాద్, రజినీ తెలిపారు. శనివారం మండలంలో 21 రకాల దివ్యాంగులను 0 నుంచి 16 సంవత్సరాల లోపు పిల్లలను సర్వేచేసి 45 మందిని గుర్తించామని తెలిపారు. మూడు సంవత్సరాలు పైబడిన వారిని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలోనూ, 5 సంవత్సరాలు పైబడిన వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే బాధ్యతను తీసుకొని వారి అవసరాన్ని బట్టి సౌకర్యాలను కల్పిస్తామన్నారు. 9వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందని వారు తెలిపారు.

మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు

గుంతకల్లు టౌన్, జూన్ 1: ఖరీఫ్ సీజన్‌లో రైతులు మెలకువలను పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని డీర్సీఏ ఏడీఏ శైలజ అన్నారు. స్థానిక ఆర్బీకే కేంద్రంలో శనివారం ఖరీఫ్ సీజన్ సంసిద్ధతపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సరైన సమయంలో వర్షాలు పడుతున్నాయన్నారు. రైతులు లోతు దుక్కులు దున్నడం ద్వారా పొలంలోనే నీరు ఇంకి పోయే విధంగా చేసుకోవాలన్నారు. విత్తన శుద్ధి, కలుపు నివారణ, ఎరువులు వినియోగం, పురుగుమందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఉరవకొండ డివిజన్ ఏడీఏ పద్మజ, ఏఈఓ ప్రసాద్, గుంతకల్లు ఏఓ కే స్వాతి పాల్గొన్నారు

పోస్టర్ల ఆవిష్కరణ

గుత్తి, జూన్ 1: ప్రజల్లో శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం, ప్రజల కోసం సైన్స్ అంటూ జేవీవీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రజల్లో మూఢ నమ్మకాలను పారదోలేందుకు, వాటికి వ్యతిరేకంగా జేవీవీ కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల అభివృద్ధి, ఆరోగ్యం కోసం పాటుపడుతుందన్నారు. అనంతరం జేవీవీ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రంగన్న, జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.